క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ

పెడన: పట్టణ ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాసవి క్షేత్రం వద్ద సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకులు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా ప్రారంభించారు. చిన్నా మాట్లాడుతూ రోజూ ఉదయం 11 గంటల నుంచి ఈ మజ్జిగ పంపిణీ చేపడతామన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కేటీ మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు కొల్లిపర నరసింహారావు, మాతా సాయి, జల్లూరి రంగారావు, ఉదయగిరి గోపాల్, కొల్లూరి భాస్కర్, కొమ్మూరి విజయదుర్గ, బొలిశెట్టి విమల, సమయమంత్రి యామిని, కొమ్మూరి సారిక, జల్లూరి రమేష్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఇవ్వలేదని దాడి

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ద్విచక్రవాహనం అడిగితే ఇవ్వలేదని మారణాయుధంతో దాడి చేసిన ఘటన పెదకళ్లేపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. పెదకళ్లేపల్లికి చెందిన కంచర్లపల్లి వెంకటేశ్వరావు మేనల్లుడు చినయాదర గ్రామానికి చెందిన అరజా రాహుల్ ద్విచక్రవాహనాన్ని అడిగాడు. వెంకటేశ్వరావు ఇవ్వనన్నందుకు కోపంతో దాడిచేసినట్లు స్థానికులు తెలిపారు. మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు వివరించారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ లాజిక్ కంపెనీ వారిచే ఈ ఎంపికలు జరిగాయన్నారు. కళాశాలలో 4 వ సంవత్సరం చదువుతున్న బీటెక్ విద్యార్థులు ఈ ఎంపికలో పాల్గొన్నారని, రాత పరీక్ష, సమూహ చర్చ, ఇంటర్వ్యూ ద్వారా 35 మంది విద్యార్థులను ఎంపిక చేసుకున్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల జీఎం ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దోసపాటి బాబా, సెక్రటరీ టీ మెహర్ బాబా, కరస్పాండెంట్ కె.కుమార్‌బాబు, కళాశాల శిక్షణ, ఉపాధి విభాగాధిపతి డి.ఆదిత్యకుమార్ తదితరులు అభినందించారన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

మచిలీపట్నంటౌన్: నగరంలోని బచ్చుపేటలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. 14 నెలలకు సంబంధించి రూ.14.76 లక్షల మేర ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఆంజనేయస్వామి తెలిపారు. శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయానికి రూ.3.10 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని మచిలీపట్నం డివిజన్ దేవాలయాల తనిఖీ అధికారి కె. శ్రీనివాసరావు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త చైర్మన్ ముత్తేవి రవికాంత్ పర్యవేక్షించారు.

14 మంది గైర్హాజరు

కృత్తివెన్ను: మండలంలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఎంఈవో ప్రసాదరావు తెలిపారు. సోమవారం గణితం పరీక్ష నిర్వహించగా సంగమూడి, లక్ష్మీపురం, పోడు పరీక్ష కేంద్రాలలో మొత్తం ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు 407 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 393 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారన్నారు. 14 మంది పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు.

ఆటో పల్టీ.. డ్రైవర్ మృతి

కోనేరుసెంటర్: ఆటో పల్టీ కొట్టటంతో డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన బందరు మండలం తపసిపూడి గ్రామానికి సమీపంలో జరిగింది. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. బందరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. మచిలీపట్నం గుమస్తాలా కాలనీ, హౌసింగ్‌బోర్డుకాలనీలకు చెందిన మర్సకట్ల అఖిలాష్ (27), పెద్దిబోయిన అభయాంజనేయులు, నూతి మనోజ్‌కుమార్, ముక్కు అరవిందబాబు, నాంపల్లి కుమార్‌సాయి, పరసా హేమంత్‌కుమార్ స్నేహితులు. ఆదివారం అఖిలాష్ ఆటోలో స్నేహితులంతా కలిసి మంగినపూడి బీచ్‌కు వెళ్లారు. సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా తపసిపూడికి సమీపంలో ఆటో నడుపుతున్న అఖిలాష్ అడ్డు వచ్చిన కుక్కను తప్పించే ప్రయత్నంలో ఆటో అదుపు తప్పి పక్కకు పడిపోయింది. దీంతో అఖిలాష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన స్నేహితులంతా గాయాలతో బయటపడ్డారు. వీరిని అంబులెన్స్‌లో మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అఖిలాష్ మృతదేహాన్ని చూసేందుకు మరింత మంది ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. క్షతగాత్రులకు చికిత్స చేయటం సమస్యగా మారటంతో సిబ్బంది అందరినీ బయటికి పంపి తలుపులు మూసేశారు. దీంతో ఆగ్రహానికి గురైన అభయాంజనేయులు తలుపు అద్దాలను తట్టడంతో అవి పగిలి చేతికి గాయమై 16 కుట్లు పడ్డాయి. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

ఘనంగా సేవాభారతి వార్షికోత్సవం

కృత్తివెన్ను: గత రెండేళ్లుగా సేవాభారతి పేరుతో విద్యార్థులకు అందిస్తున్న ఉచిత ట్యూషన్ సెంటర్లు ఎంతగానో ఉపయోగపడుతున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులన్నారు. ఆదివారం రాత్రి సేవాభారతివార్షికోత్సవాన్ని నిర్వ హించారు. వారు మాట్లాడుతూ మండలంలో 14 అభ్యాసక్ కేంద్రాలను ఏర్పాటు చేసి 482 మందికి ఉచితంగా ట్యూషన్ అందిస్తున్నామన్నారు.

మద్యపానం.. బహిరంగం

- విచ్చల విడిగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవనం
- రెండు నెలల కాలంలో అధికారులు పట్టుకుంది ఒక్కరినే
- ఇంటినీ, ఒంటినీ గుల్ల చేసుకుంటున్న పేదలు
- అసౌకర్యానికి గురవుతున్న ప్రజలు
- చూసీచూడనట్టు వదిలేస్తున్న అధికారులు


చల్లపల్లి బైపాస్ రోడ్డులో చెట్టు కింద మద్యం సేవిస్తున్న దృశ్యం


మద్యం తాగి స్పృహలేకుండా పడిపోయిన మందుబాబు

చల్లపల్లి: రాత్రీ పగలూ తేడా లేకుండా మందుబాబులు బహిరంగంగా మద్యం సేవిస్తూ సామాన్య ప్రజలను అసౌకర్యానికి గురిచేస్తున్నారు. అక్కడ.. ఇక్కడ.. ఎక్కడ చూసినా నిత్యం ఏదో ఒక చోట బహిరంగ ప్రదేశాల్లో మందు బాబులు మద్యం సేవిస్తున్నా కనిపిస్తున్నారు. గత రెండు నెలల కాలంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్నాడని కేవలం ఒకే ఒక్కడిని మాత్రమే అధికారులు అదుపులోకి తీసుకున్నారంటే వారి పర్యవేక్షణ, నిఘా ఏర్పాట్లు ఎంత పటిష్టంగా ఉన్నాయో అర్థమవుతుంది.

మండలంలో నాలుగు షాపులు..

చల్లపల్లిలో మూడు, లక్ష్మీపురంలో ఒకటి చల్లపల్లి మండలంలో మొత్తం నాలుగు మద్యం షాపులు కేటాయించారు. చల్లపల్లి- మచిలీపట్నం ప్రధాన రహదారి పక్కన స్మార్ట్ బజార్ పక్కన రెండు, బైపాస్ రోడ్డులో సాగర్ థియేటర్ పక్కన ఒకటి, లక్ష్మీపురం- మంగళాపురం రోడ్డులో మరొకటి ఇలా మొత్తం నాలుగు మద్యం షాపులు ప్రధాన రహదారుల పక్కనే ఏర్పాటు చేయటంతో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్య రోడ్లపై తీవ్ర రద్దీ ఏర్పడుతోంది. రాత్రి పంది గంటలకు షాపులు క్లోజ్ చేయాల్సి ఉండగా అంతకు మించే ఉంటున్నారు.

మండలంలో 45 బెల్టు షాపులు..

మండలంలో 11 పంచాయతీలు ఉండగా బెల్టు షాపులు 45 ఉన్నాయి. ఒక్కొక్క గ్రామానికి సుమారు నాలుగు బెల్టు షాపులు కొనసాగుతున్నాయి.

ఎప్పుడు ఏగొడవ వస్తుందో..

అసలే మత్తు మైకంలో ఉన్న కొందరు తూలుతూ తమపై పడి ఎక్కడ గొడవకు దిగుతారో అని ఆ మార్గంలో రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు బిక్కుబిక్కు మంటూ వెళుతున్నారు. ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో చల్లపల్లి బైపాస్ రోడ్డులో అటుగా వెళుతున్న ఓ వ్యక్తిని మద్యం సేవించిన కొందరు ఆపి అతని సెల్ ఫోన్ లాక్కొని దూషించి ఇబ్బంది పెట్టినట్లు తెలిసింది. మగవారి పరిస్థితే ఇలా ఉంటే ముఖ్యంగా యువతులు, మహిళల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

బస్‌షెల్టర్లలో సిట్టింగులు..

రాత్రీ పగలూ తేడా లేకుండా మూసివున్న షాపుల వద్ద, రాత్రిళ్లు రోడ్లపైనే మందుబాబులు పనికాని చేస్తున్నారు. డోసు ఎక్కువై కొందరు అక్కడే పడిపోయి గలీజు చేస్తున్నారు. లక్ష్మీపురంలో అయితే మందు బాటిల్స్ కొనుక్కుని చల్లపల్లి- మచిలీపట్నం 216 జాతీయ రహదారిపై ఉన్న బస్ షెల్టర్లలో సిట్టింగులు ఏర్పాటు చేసుకుంటున్నారు. మరికొందరైతే తాగిన మద్యం సీసాలను తీసుకువచ్చి స్థానిక బస్టాండు ఆవరణలో పడేసి చేతులు దులుపుకుని పోతున్నారు. ఇంత విచ్చల విడిగా బహిరంగ ప్రదేశాల్లో పట్టపగలే మందు బాబులు మద్యం సేవిస్తున్నా అరికట్టాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పనితీరుకు నిదర్శనం..

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్నారని గత రెండు నెలల కాలంలో కేవలం ఒకే ఒక్క వ్యక్తిని అరెస్టు చేయటం మొవ్వ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారుల పనితీరుకు నిదర్శనమని పలువురు పెదవి విరుస్తున్నారు. అధికారులు స్పందించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారిని అదుపులోకి తీసుకుని రోడ్లపై ప్రశాంతంగా రాకపోకలు సాగించేలా అవకాశం కల్పించి శాంతి భద్రతలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

> **ప్రత్యేక టీములు ఏర్పాటు చేస్తున్నాం..**
>
> రేపటి నుంచి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. ఎవరైనా బహిరంగ మద్యం సేవించినా, బెల్టుషాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటాం. మళ్లీ మళ్లీ ఇదే నేరాలకు పాల్పడితే వారిపై పీడీ యాక్టు అమలు చేస్తాం.
>
> – బి.వరాలరాజు, ఎక్సైజ్ సీఐ, మొవ్వ

ఫైలేరియా బాధితులకు ఉపశమన కిట్ల పంపిణీ



పెడన: ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ఆ వ్యాధి ఉపశమన కిట్లను సోమవారం జిల్లా మలేరియా అధికారి బి. రామారావు అందజేశారు. స్థానిక అర్బన్ హెల్త్ సెంటరులో ఆయన మాట్లాడుతూ ఫైలేరియా ప్రారంభ దశలోనే గుర్తించి మందులు క్రమం తప్పకుండా వాడితే, దానిని మరింత వ్యాపించకుండా అరికట్టవచ్చన్నారు. వైద్యుల సూచనలు పాటిస్తూ ఇచ్చిన మందులను నిత్యంవాడుతూ పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సబ్‌యూనిట్ ఆఫీసర్ మురళి మాట్లాడుతూ పట్టణంలో ఫైలేరియా బాధితులు 122 మంది ఉన్నారని, వీరందరికీ ఉపశమనం కిట్లను అందజేశామన్నారు. పెడన పీహెచ్‌సీలో ఇస్తామన్నారు. అర్బన్ హెల్త్‌సెంటరు వైద్యురాలు డాక్టర్ తమ్మన హిమపద్మజ, సబ్ యూనిట్ ఆఫీసర్ పామర్తి మురళి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఆస్పత్రి వైద్య సిబ్బంది, పెడన పీహెచ్‌సీలో వైద్యాధికారి మీనాదేవి, పీహెచ్‌వో రత్నకుమారి, టీహెచ్ఎన్ సౌదామణి పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

చల్లపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎ.వి.రమణ సోమవారం తెలిపారు. ఎంపీపీ కోట విజయరాధిక అధ్యక్షతన మధ్యాహ్నం 2.30 గంటల నుంచి జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలని కోరారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన


చల్లపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది తదితరులు

చల్లపల్లి: హానికరమైన పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని తద్వారా క్షయ వ్యాధి బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం చల్లపల్లి పురవీధుల్లో వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. క్షయవ్యాధి లక్షణాలు, నివారణకు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే మందులు, తీసుకోవాల్సిన పోషకాహారం, ఇతర జాగ్రత్తలు వంటి అంశాలపై వైద్యులు నినాదాలు చేస్తూ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు సుమా చౌదరి, వంశీకృష్ణ, ఉమామహేష్, ఎస్‌టీఎస్ జి.లలిత, ఎస్‌టీఎల్ఎస్ పి.రాజేష్, ఎంపీహెచ్ఎస్ డి.కమల, ఎల్‌టీ టి.రతన్‌సింగ్, ఆస్పత్రి సిబ్బంది, పురిటిగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్ఓ సువారి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: టీబీ వ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ బోధన వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ టి.శివయ్య సూచించారు. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక చిలకలపూడి యూపీహెచ్‌సీలో వైద్య కళాశాల ఆధ్వర్యంలో టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి డాక్టర్ శివయ్య మాట్లాడుతూ 1882 మార్చి 24న రాబర్ట్ కాక్ అనే శాస్త్రవేత్త టీబీ బ్యాక్టీరియాను కనుగొన్నారన్నారు. 'అవును టీబీని అంతమొందించ గలం' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాల: క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ అన్నారు. ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. క్షయ వ్యాధి పట్ల అవగాహన కల్పించి, టీబీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీహెచ్ఎస్ఎఫ్ ఎం.శివకృష్ణ, ఫార్మసిస్టు కృష్ణ, పీహెచ్‌సీ సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలు దుర్వినియోగం కాకుండా చూడాలి


మహిళలకు పండ్ల మొక్కలను అందజేస్తున్న అతిథులు, సంస్థ ప్రతినిధులు

నాగాయలంక: నేటి సమాజంలో మహిళలపై నిత్యం కొనసాగే అకృత్యాలకు అడ్డుకట్ట వేయాలని, మహిళా చట్టాలను దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైన ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. రక్షణసైన్యం (సాల్వేషన్ ఆర్మీ) జిల్లా సంస్థ ఆధ్వర్యంలో నాగాయలంక బోస్ బొమ్మ సెంటర్‌లోని సంస్థ కార్యాలయం ఆవరణలో సోమవారం సమాజంలో మహిళా సాధికారతపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సంస్థ జిల్లా అధికారి (డి.ఓ) మేజర్ తెలగతోటి ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో మహిళా నేత తలశిల స్వర్ణలత మాట్లాడుతూ మహిళల ఎంపవర్‌మెంట్ తోనే సామాజిక, కుటుంబ, మహిళాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ఇళ్ల వెంబడి తిరుగుతూ రోజువారీ, వారపు అప్పుల పేరుతో ఇచ్చే మోసపు సంస్థల బారిన పడకుండా మహిళలు ప్రభుత్వ ఆర్థిక సంస్థలు, బ్యాంకుల ద్వారా రుణాలు పొంది ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు. ఈ సదస్సుకు చెన్నైలోని రక్షణ సైన్యం ప్రాజెక్ట్ ఆఫీసర్ మేజర్.డి.విజయకుమార్, సీపీ కోఆర్డినేటర్ పి.జీవన్ రాయ్ ముఖ్యఅతిథులుగా హాజరై మహిళలకు పలు సాధికారత అంశాలను వివరించారు. ఈ సందర్భంగా జీవన్ రాయ్ అధ్వర్యంలో 40 మంది మహిళలకు నిమ్మ, దానిమ్మ, మామిడి లాంటి మొక్కలను అందజేశారు. సంస్థ మహిళా అధికారి టి.దీనకుమారి, ప్రతినిధులు, సంఘాల విశ్వాసులు పాల్గొన్నారు.

ఇరిగేషన్, డ్రెయినేజీ, వ్యవసాయ రంగాలపై దృష్టి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

పులిగడ్డ(అవనిగడ్డ): కూటమి ప్రభుత్వంలో ఇరిగేషన్, డ్రెయినేజీ, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. మండల పరిధిలోని పులిగడ్డ ఇరిగేషన్ కార్యాలయం వద్ద సోమవారం ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.12 కోట్లతో ఇరిగేషన్ రంగాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. రూ.35 కోట్లతో అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూ.1.10 కోట్లతో పులిగడ్డ అక్విడెక్టును పూర్తిగా ఆధునికీకరిస్తున్నట్టు వివరించారు. అనంతరం అక్విడెక్టు అభివృద్ధి పనులను బుద్ధప్రసాద్ పరిశీలించారు.

అటవీఅధికారుల తీరుతో..

అటవీశాఖాధికారుల తీరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చెప్పారు. ఇరిగేషన్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో సాగర సంగమం అభివృద్ధి కోసం రహదారిని మంజూరు చేయిస్తే సగంలో ఆపేశారన్నారు. ఇప్పుడు సాగర సంగమం వద్ద ఏకంగా టోల్ వసూలు చేయడం వల్ల పర్యాటకుల సంఖ్య తగ్గి పోయిందన్నారు. కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు అయిన పూడి భానుప్రకాష్, బండ్రెడ్డి నాగమల్లిఖార్జున రావు, ఇరిగేషన్ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, డ్రెయినేజీ డీఈ వీరాంజనేయులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేత్రాలు దానం


మృతుడు పుల్లయ్య(ఫైల్)

నాగాయలంక: గ్రామంలోని రెండో వార్డుకు చెందిన నాగిడి పుల్లయ్య (72) అనారోగ్యంతో సోమవారం మరణించగా అతని నేత్రాలను స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ద్వారా విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. మరో ఇద్దరికి చూపునిచ్చే అవకాశం కల్పించాలనే సంకల్పంతో పుల్లయ్య చివరి కోరికను నెరవేర్చే క్రమంలో కుమారులు పరమేశ్వరరావు, నాగభూషణం ఇతర కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా నేత్రదానానికి ముందు కొచ్చారు. సేవాసంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె.వెంకటనారాయణ లకు సమాచారం అందించగా వారి సహకారంతో కంటి ఆసుపత్రి ఐ టెక్నీషియన్ సాయి బృందం వచ్చి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు. తమ సంస్థ ద్వారా ఇప్పటికి సేకరించిన నేత్రాల సంఖ్య 227కి చేరిందని రఘుశేఖర్ చెప్పారు.


టెన్త్ విద్యార్థులకు కూల్ డ్రింక్స్ పంపిణీ

మచిలీపట్నంటౌన్: ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సమాజసేవే పరమాత్ముని సేవగా భావించే సత్యసాయి సేవా సంస్థలు, కృష్ణాజిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక టెన్త్ పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు కూల్ డ్రింక్స్‌ను పంపిణీ చేశారు. నగరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల కేంద్రాలైన శ్రీబాలాజీ విద్యాలయం, మాస్టర్ ఈకే బాలభాను విద్యాలయం, ఎస్సార్ ప్రేమ్ హై స్కూల్, షార్కిగరల్స్ హైస్కూల్, రాంజీ హై స్కూల్ వద్ద సుమారు 600 మంది విద్యార్థులకు పరీక్ష అనంతరం పంపిణీ చేశారు.సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్, సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయ కుమార్, జిల్లా యువజన విభాగ సమన్వయకర్త తుళ్లపాటి సాయి కృష్ణచైతన్య, ఐటీ సమన్వయకర్త బి.నరేంద్ర,విద్యావిభాగ సమన్వయకర్త పి.వరప్రసాద్, సేవాదల సమన్వయకర్తలు కూరాళ్ల అనిల్, అద్దేపల్లి మనోహర్, కొట్టి నాగమణి, యువజన విభాగ సమన్వయకర్త నడకుదుటి నాగగాయత్రి, ప్రీ సేవాదళ సభ్యులు, మహిళా సేవా దళ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యసేవ ఫీల్డ్ సిబ్బందికి మినిమం స్కేల్ ఇవ్వాలి

మచిలీపట్నం అర్బన్: వైద్య సేవా పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ లెవల్ సిబ్బందికి మినిమమ్ స్కేల్, కేడర్, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వ అస్పత్రిలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బంది 17 ఏళ్ల సర్వీసుని పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ పరిధిలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. వైద్య మిత్రలకు డీపీఓ క్యాడర్, ఆఫీస్ అసోసియేట్, టీమ్ లీడర్లకు సమాన అర్హత, జిల్లా మేనేజర్లకు డీవైఈఓ క్యాడర్ అమలు చేసి కనీస వేతనం ఇవ్వాలని కోరారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ఉద్యోగి చనిపోయిన కుటుంబాలకు రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియో, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు, ప్రభుత్వఉద్యోగాలలో వెయిటేజీ కల్పించాలని, సిబ్బందికి అంతర్గత ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎంహెచ్ఓ ఎస్.శరిష్ఠకు వినతి పత్రం సమర్పించారు. స్టేట్ యూనియన్ జనరల్ సెక్రటరీ గురవయ్య, జిల్లా ప్రెసిడెంట్ నాగరాజు, సెక్రటరీ పోతురాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ డెన్నిపాల్, కోశాధికారి అనిత పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


బంటుమిల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘ నాయకులు

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు కాలనీలు, గ్రామాల్లో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న మౌలిక సౌకర్యాలను పరిష్కరించాలంటూ బాధితులు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయా గ్రామాల బాధితులు సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. గత కొద్ది రోజులుగా పార్టీ నిర్వహించిన పరిశీలనలో ఎదురైన సమస్యలపై నాయకుల సహకారంతో తహసీల్దార్, సచివాలయ కార్యదర్శులు, వీఆర్‌ఓలకు గ్రామ, గ్రామాన బాధితులు వినతి పత్రాలు ఇచ్చారు. సీపీఎం, రైతు సంఘం, సీఐటీయూ, ఐద్వా నాయకులు ఎం.శ్రీనివాసరావు, జీ నాగేశ్వరరావు, పీ ధనశ్రీ, ఎల్. అజయ్‌ఘోష్, బాధితులు, తదితరులు ఉన్నారు.

ఘంటసాల: స్థానిక అంబేడ్కర్ నగర్‌లో శ్మశానం, వాటర్ ట్యాంకు, కిడ్నీ సమస్యలు, కొత్తపల్లి ఎస్సీల శ్మశానం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, ఎంపీడీవో డి.సుబ్బారావుకు మండల సీపీఎం నేతలు సోమవారం అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో సీనియర్ సీపీఎం నేత వాకా రామచంద్రరావు, సీపీఎం మండల కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావు, నేతలు బలే రమేష్, బలే కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో జేఎల్‌ఎంకు గాయాలు

పెడన: మండల పరిధిలోని పెనుమల్లి విద్యుత్ జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న డి గోపాలరావుకు సోమవారం విద్యుత్‌షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. సేకరించిన వివరాల మేరకు.. పెనుమల్లి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుదాఘాతానికి గోపాలరావు గురికావడంతో హుటాహుటిన మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం మచిలీపట్నం నుంచి విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. పెడన ఏడీఏ సీహెచ్ మాణిక్యాలరావు, ఏఈ ఏడుకొండలు, ఇతర లైన్‌మెన్‌లు, విద్యుత్ సిబ్బంది విజయవాడ ఆసుపత్రికి తరలి వెళ్లారు.

'పది' పరీక్షల్లో 55 మంది ఇన్విజిలేటర్లకు జంబ్లింగ్

పెడన: మండల పరిధిలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో ఇన్విజిలేషన్ విధులు నిర్వహిస్తున్న 55 మంది ఉపాధ్యాయులకు గత మూడు పరీక్షలకు కేటాయించిన పరీక్ష కేంద్రాలు కాకుండా ఇతర పరీక్ష కేంద్రాల్లో విధులు కేటాయించినట్లు ఎంఈవో- 2 వైవీ హరనాథ్ సోమవారం తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నామన్నారు. సోమవారం జరిగిన గణితం పరీక్షకు 98 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. 5 కేంద్రాలకు 574 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 563 మంది హాజరవ్వగా 11 మంది గైర్హాజరయ్యారన్నారు. చెన్నూరు జెడ్పీహెచ్ఎస్ సెంటరులో 60 మందికి 55 మంది హాజరవ్వగా ఐదుగురు ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. భట్టా జ్ఞాన కోటయ్య జెడ్పీహెచ్ఎస్‌లో ఏ-సెంటరులో 168 మందికి గాను 166 మంది హాజరవగా ఇద్దరు ఆబ్సెంట్ అయ్యారని, బీ- సెంటర్‌లో 126 మందికి 124 మంది హాజరవగా ఇద్దరు ఆబ్సెంట్ అయ్యారని పేర్కొన్నారు. బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కాలేజీ సెంటర్‌లో 140 మందికి 139 మంది హాజరు కాగా ఒకరు ఆబ్సెంట్ అయ్యారన్నారు. మర్కజ్ దారుల్ బిర్ సెంటర్లో 78 మందికి 77 మంది హాజరయ్యారని తెలిపారు.

బీజేపీ నేత రమాదేవి భర్త మృతి

పర్రచివర (నాగాయలంక): కేంద్ర సెన్సార్ బోర్డు మాజీ సభ్యురాలు, రాష్ట్ర బీజేపీ మహిళామోర్చా మాజీ ఉపాధ్యక్షురాలు రమాదేవికి పతీవియోగం జరిగింది. గత కొంత కాలంగా అస్వస్థతతో ఉన్న ఆమె భర్త బీజేపి నేత మహేంద్రభాస్కర్ (80) సోమవారం మరణించారు. విషయం తెలుసుకున్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పర్రచివర గ్రామంలో మహేంద్ర భాస్కర్ భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన భార్య రమాదేవి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. భావదేవరపల్లి సర్పంచి మండలి ఉదయభాస్కర్, మండల బీజేపీ నాయకులు, ప్రముఖులు మహేంద్ర భాస్కర్ భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. మహిళా బీజేపీ నేత రమాదేవిని పరామర్శించి తమ సానుభూతి ప్రకటించారు.

ఆక్రమణను అడ్డుకున్న అధికారులు

పెడన: పట్టణంలోని 16వ వార్డులో ప్రధాన మురుగు కాలువపై ప్రహరి నిర్మించడాన్ని మున్సిపల్ అధికారులు సోమవారం అడ్డుకున్నారు. మురుగుకాలువను దాటి నిర్మిస్తున్న ప్రహరిని అడ్డుకుని తక్షణం నిర్మాణాన్ని ఆపేసి కట్టిన సిమెంటు ఇటుకలను తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఇంటి యాజమానికి సూచించారు. అయితే ఈ నిర్మాణానికి టీడీపీ నాయకులు కొందరు రంగంలోకి దిగి ఈ అక్రమ నిర్మాణానికి వత్తాసు పలకడమే కాకుండా మున్సిపల్ అధికారులపై ఒత్తిడి చేస్తూ నిర్మాణాన్ని అడ్డుకోవద్దని చెబుతున్నట్లు సమాచారం. అక్రమ నిర్మాణాలను టీడీపీ నాయకులు ప్రొత్సహిస్తున్నట్లుగా దీనిని బట్టి వెల్లడవుతోంది. మున్సిపల్ అధికారులు ఈ అక్రమ నిర్మాణాన్ని పూర్తిగా తొలగిస్తారా ఒత్తిళ్లకు తలొగ్గుతారా అనేది వేచి చూడాలి.

వాటర్ ప్లాంట్ బహిరంగ వేలం వాయిదా

లంకపల్లి(ఘంటసాల): పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లంకపల్లి మినరల్ వాటర్ ప్లాంట్ వేలం వాయిదా పడినట్లు ఈఓపీఆర్డీ కె.వెంకటేశ్వరావు తెలిపారు. మండలంలోని లంకపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్ బహిరంగ వేలం సోమవారం సాయంత్రం పంచాయతీ ప్రాంగణంలో నిర్వహించారు. పాటదారులు సకాలంలో రాకపోవడం, డిఫాజిట్లు చెల్లించకపోవడంతో వేలంను వాయిదా వేసినట్లు ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు తెలిపారు. మళ్లీ ఈ నెల 27న సాయంత్రం 3 గంటలకు వేలం నిర్వహించాలని నిర్ణయించారు. కార్యదర్శి కందుల నాగనాంచారమ్మ, వైస్ ఎంపీపీ మాడెం నాగరాజు, సిబ్బంది, పాటదారులు పాల్గొన్నారు.

అలంకరణ చేపల పెంపకంతో ఉపాధి

ఘంటసాల: ఆక్వేరియం తయారీ, అలంకరణ చేపల పెంపకం ద్వారా యువత ఆదాయాన్ని పొందవచ్చని ఘంటసాల కేవీకే మత్స్యశాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్ అన్నారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో గ్రామీణ యువతకు అలంకరణ చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులపై సోమవారం మూడవ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, శాస్త్రవేత్తలు డాక్టర్ మంజువాణి, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ రేవతి, డాక్టర్ వెంకట లక్ష్మి, గ్రామీణ యువత పాల్గొన్నారు.